# బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఆశీర్వదించండి

**ఎమ్మెల్సీ తాతా మధుసూదన్**
**ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ బైక్ ర్యాలీ**

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 14 : భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావును రాబోయే ఎన్నికల్లో ఓటర్లు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రజలు ఆశీర్వదిస్తే.. మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేసి చూపిస్తామని ఖమ్మం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మారుమూల ప్రాంతమైన ఎదిర గ్రామం నుంచి సురవీడు, విజయపురికాలనీ, కొండాపురం, ఆలుబాక, అబ్బాయిగూడెం, రామచంద్రాపురం, అంకన్నగూడెం, వీరభద్రవరం, పాత్రాపురం, ఉప్పేడువీరాపురం, వెంకటాపురం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వెంకటాపురంలో ప్రధాన రహదారులపై రోడ్ షో నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు, అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు మహిళలు మంగళహారతులు, పూలదండతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం తెల్లం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో పలువురు చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, సీనియర్ నాయకులు గూడవర్తి నర్సింహమూర్తి, మానే రామకృష్ణ, రంగారావు, తాళ్లపల్లి రమేశ్, వెంకటాపురం మాజీ పీఏసీఎస్ చైర్మన్ గూడపాటి శ్రీనివాసరావు, నూగూరు మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి డర్రా దామోదర్, నాయకులు పెనుమల్ల కృష్ణారెడ్డి, వేల్పూరి లక్ష్మీనారాయణ, పిల్లారిశెట్టి మురళి, ముడుంబా శ్రీను, జాగర శాంతమూర్తి, శివాజీ యాదవ్, జక్కుల సమ్మయ్య, గడ్డం వివేక్, జజ్జరి పాపారావు, నారాయణమ్మ పాల్గొన్నారు.


రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పక్కన అభ్యర్థి తెల్లం వెంకట్రావు


వెంకటాపురం రోడ్ షోలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు

# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**తెల్లం వెంకట్రావు సతీమణి ప్రవీణ**

భద్రాచలం, నవంబర్ 14 : బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలిచిందని భద్రాచలం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు సతీమణి ప్రవీణ అన్నారు. మంగళవారం ఆమె భద్రాచలం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో 149 బూత్‌లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో పేదింటి ఆడపిల్లలకు పెళ్లి చేయాలంటే అప్పు చేయక తప్పేది కాదని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో ద్వారా ప్రతి ఇంటికి సీఎం కేసీఆర్ పెద్దన్న లాగా మారి ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.1,00,116 అందజేస్తున్నారని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని, రైతుబంధు, రైతుబీమా పథకాలు ప్రవేశపెట్టి ఎకరానికి ఏడాదికి రూ.10 వేలు అందజేస్తున్నారని, బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే సంవత్సరానికి ఏడాదికి ఎకరానికి రూ.16 వేలు దఫదఫాలుగా అందజేస్తారని చెప్పారు. గ్యాస్ సిలెండర్‌ను రూ.400లకే అందించడం జరుగుతుందని, రేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి జీవిత బీమా ఉంటుందని, ప్రీమియం సొమ్ము ప్రభుత్వమే చెల్లిస్తుందని, అలాగే అర్హులైన ప్రతి మహిళలకు నెలకు రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఆశీర్వదించి వెంకట్రావును గెలిపిస్తే భద్రాచలం నియోజకవర్గం ప్రగతిపథంలో దూసుకుపోతుందని తెలిపారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మవద్దని, బీఆర్‌ఎస్‌కే ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు దారపునేని రాంబాబు, నర్రా రాము, దుద్దుకూరి సాయిబాబా, సంధ్య పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న తెల్లం వెంకట్రావు సతీమణి ప్రవీణ

# కార్తీక సందడి షురూ..


శివుడికి పూజలు చేస్తున్న అర్చకుడు

పర్ణశాల, నవంబర్ 14 : దీపావళి అమావాస్య తర్వాత సోమవారం సాయంత్రం నుంచి పాడ్యమి రావడంతో కార్తీక మాసం ప్రారంభమైంది. మంగళవారం ఉదయం నుంచి శైవ విష్ణు దేవాలయాల్లో కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి. హిందూ పురాణాల్లో ఎంతో విశిష్టత కలిగినది కార్తీక మాసం. ఈ కార్తీకమాసంలో ప్రతి రోజు ఉదయం బ్రహ్మ ముహూర్తాన జీవనది, సముద్ర పుణ్య స్నానాలు ఆచరించి శైవ విష్ణువులను ఆరాధిస్తే ఐశ్వర్యం వరిస్తుందని, ఆయురారోగ్యాలు అనుసరించి పుణ్యం వరిస్తుందని వేదాలు చెప్తున్నాయి. ముఖ్యంగా స్కంద పురాణం కార్తీకమాస విశిష్టతను ఎంతో వివరంగా వివరించింది. ఈ కార్తీకమాస పూజా ప్రాముఖ్యతను మంగళవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామాలయ శివాలయ అర్చకులు నరసింహాచార్యులు, కిశోర్‌చార్యులు, శ్రీనివాసశర్మ వివరించారు. కార్తీకమాసం ఎంతో ప్రాముఖ్యత, విశిష్టత కలిగిందని, ఈ మాసంలో భక్తిశ్రద్ధలతో శైవ విష్ణువులను పూజించే వారికి ఎంతో పుణ్యం కలుగుతుందని తెలిపారు. కార్తీక మాసంలో శివుడు విష్ణువుడు కలిసి కార్తీక దామోదర రూపంలో భక్తులకు దర్శనమిస్తారని, ఈ రూపం ఎంతో అమోఘమని, ఈ రూపంలో వారిని దర్శించుకుంటే ఐశ్వర్యం లభిస్తుందన్నారు. శైవ విష్ణు ఆలయాలు ముందు ఈ కార్తీకమాసం మొత్తం పక్షంరోజుల్లో ఆలయ ప్రధాన అగ్ని దేవునికి దీపాలంకరణ చేసి దీపారాధన అర్పించడం ద్వారా అజ్ఞానం పోయి జ్ఞానం, ముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు, వనభోజనాలు చేయడం ఎంతో పవిత్రమైందన్నారు. జీవనవిధానంలో ఎంతో మార్పు వచ్చి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి, సమయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తే ముక్కోటి దేవతల ఆశీస్సులు అందుతాయని తెలిపారు. అయ్యప్ప మాలలు వేసే భక్తులకు కార్తీకమాసం ఎంతో అనువైందని, వారు ముల్లోకాల్లో చిరంజీవులుగా ఉంటారని అర్చకులు పేర్కొన్నారు.


అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు


### నదీస్నానాలు ఎంతో పుణ్యం



కార్తీక మాసంలో జీవ నది, సముద్ర పుణ్య స్నానాలు ఆచరించి శైవ, విష్ణువును ఆరాధిస్తే ఎంతో పుణ్యం లభిస్తుంది. ఐశ్వర్యం, ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఆది దేవుడైన అగ్ని దేవుడికి దీపాలు వెలిగించి అర్పించడం ద్వారా అజ్ఞానం మటుమాయమై జ్ఞానం లభిస్తుంది.

– కిశోర్‌చార్యులు, పర్ణశాల అర్చకుడు

### 'కార్తీకం' ఎంతో ప్రాముఖ్యం



కార్తీక మాసం ఎంతో ప్రాముఖ్యమైంది. ఈ మాసంలో శివుడు విష్ణువు కలిసి కార్తీక దామోదర రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. అందుకే శివుని దర్శనం చేసుకున్న విష్ణువును దర్శనం చేసుకున్నా ఎంతో మేలు కలుగుతుంది. దీపారాధన చేస్తే వారికి సుఖసంతోషాలు లభిస్తాయి. అయ్యప్ప మాల ధరించే వారికి కార్తీక మాసం ఎంతో అనువైంది.

– నరసింహాచార్యులు, పర్ణశాల ప్రధాన అర్చకుడు

## ఘనంగా రామయ్య నిత్య కల్యాణం


రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, నవంబర్ 14 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో మంగళవారం సీతారాములకు నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## రాముని సన్నిధిలో ఎన్నికల పరిశీలకుడు

పర్ణశాల, నవంబర్ 14 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రాములవారిని మంగళవారం ఎన్నికల పరిశీలకుడు కమల్ కిశోర్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నరసింహాచార్యులు, కిశోర్‌చార్యులు, అధికారులు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన పంచవటి నారచీరెల ప్రాంతాన్ని దర్శించి ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట దుమ్ముగూడెం పోలీస్‌శాఖ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## తొలిరోజు కార్తీకమాస పూజలు

దుమ్ముగూడెం, నవంబర్ 14 : మండల కేంద్రమైన లక్ష్మీనగరంలోని శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున కార్తీక మాసం తొలిరోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష పంచామృతాభిషేకం చేసి అలంకరణ తమలపాకులతో అష్టోత్తర శతనామార్చన చేశారు. పూజల్లో గ్రామస్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

దుమ్ముగూడెం, నవంబర్ 14 : మండలంలో వానకాలం పంట విక్రయించుకునేందుకు 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్లగూడెం, నర్సాపురం, ములకపాడు, కె.లక్ష్మీపురం, చిన్న నల్లబెల్లి, దబ్బనూతల, ప్రగళ్లపల్లి, జీసీసీ ఆధ్వర్యంలో మారాయిగూడెం, మహదేవపురం, చిన్న నల్లబెల్లి, చిన్నబండిరేవులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, కామన్ రకం ధాన్యానికి రూ.2183 మద్దతు ధర ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా బాలల దినోత్సవం

భద్రాచలం, నవంబర్ 14 : లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల్లో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో చిన్నారులు అలరించారు. విజేతలకు విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మాగంటి సూర్యం మనుమడైన మాగంటి సూర్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, మాగంటి రమేశ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఆశ్రమ పాఠశాలలో...**

దుమ్ముగూడెం, నవంబర్ 14 : మండల పరిధిలోని రామచంద్రునిపేటలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించి ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులందరూ ఎంతో ఆనందంగా తోటి విద్యార్థులతో కలిసి గడిపారు. హెచ్‌ఎం, టీచర్లు, పీఈటీ, అటెండర్‌గా తమ తమ బాధ్యతను చక్కగా నిర్వర్తించారు. హెచ్‌ఎం వీరమ్మ మాట్లాడుతూ అక్షరాల సాధన కోసం విద్యార్థులు పని చేయాలన్నారు. నర్సాపురంలో సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బొల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.


దమ్ముగూడెం : చిన్నారుల నృత్యాలు